నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 9 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

## 10న ఎత్తిపోతల పథకాలపై సమీక్ష

కోదాడ టౌన్, జూన్ 8 : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని 54 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్‌పై నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, రైతులతో కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు పూర్తి స్థాయి సామర్థ్యంతో నడవాలనే సంకల్పంతో రైతులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. లిఫ్టుల నిర్వహణ కోసం ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌ను కాంట్రాక్టు పద్ధతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితోపాటు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, రైతులు హాజరు కావాలని కోరారు.

# చెల్లని పట్టభద్రుల ఓట్లు 8.27శాతం

### డిగ్రీలు పూర్తయినా ఓటు సరిగ్గా వేయలేకపోయిన వైనం

### ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో చెల్లని ఓట్లు 27,990

- గెలుపోటములపై తీవ్ర ప్రభావం
- గెలుపు కోటాకు దూరంగా తీన్మార్ మల్లన్న
- ఆధిక్యంలో ఉండడంతో ఈసీ అనుమతితో గెలుపు ప్రకటన
- పట్టభద్రుల్లో పట్టు చూపిన బీఆర్‌ఎస్
- 79,335 ద్వితీయ ఓట్లల్లో బీఆర్‌ఎస్‌దే ఆధిక్యం

నల్లగొండ ప్రతినిధి, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లు భారీగా ఉంటుండడం చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థుల ప్రచారంలో, సోషల్ మీడియాలో, అధికారికంగానూ ఎంత అవగాహన కల్పిస్తున్నా డిగ్రీలు చేతబట్టి పట్టభద్రులు అనిపించుకుంటున్న ఓటర్లు ఓటు వేయడంలో తడబాటుకు గురవుతూనే ఉన్నారు. ఈసారి కూడా చెల్లని ఓట్లు భారీగానే ఉండడం విస్మయానికి గురిచేస్తున్నది. 2021 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి అదనంగా 2.73శాతం చెల్లని ఓట్లు పోల్ కావడం గమనార్హం. గత నెల 27న జరిగిన వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్‌లో 4,63,839 మంది ఓటర్లకు గానూ 3,38,179 మంది ఓటు వేశారు. ఈ నెల 5 నుంచి మొదలైన కౌంటింగ్‌లో 6వ తేదీ సాయంత్రం తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో చెల్లని ఓట్ల సంఖ్య తేలింది. పోల్ అయిన ఓట్లలో 8.27శాతం చెల్లని ఓట్లుగా చెత్తబుట్టలో పడ్డట్లైంది. మొత్తం 27,990 మంది పట్టభద్రులు వేసిన మొదటి ప్రాధాన్యత ఓట్లు చెల్లకుండా పోయాయి. దాంతో చెల్లని ఓట్లే శుక్రవారం రాత్రి ముగిసిన లెక్కింపులో గెలుపోటములను ప్రభావితం చేయడంలో భాగమయ్యాయి. అసలే పోలింగ్ కేంద్రాలకు రాకుండా ఓటు వేయని వారిని పక్కన పెడితే వ్యయప్రయాసాలకు ఓర్చి క్యూలో నిలబడి వేసిన వారి ఓటు కూడా చెల్లకుండా పోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీస అవగాహన లేకుండా ఓటు వేసి చెల్లకుండా చేసుకోవడం ఏమిటన్న చర్చ సాగుతున్నది.

చెల్లని ఓట్లలో ఎక్కువ భాగం నిబంధనల ప్రకారం ‘1’ అని వేయకపోవడం వల్లే జరిగింది. 1ని కొందరు పరిపరి విధాలుగా రాయడంతో అసలే రాయకుండా టిక్ చేయడం, 1 రాశాక కూడా దాని పక్కన టిక్ పెట్టడం లేదా దాని చుట్టూ సున్నాలా చుట్టడం ఇలా అనేక రకాలుగా ఓటు వేయడంతో ఆ ఓట్లన్నీ చెల్లకుండా పోయాయి. అదే సమయంలో కొన్ని ఓట్ల విషయంలో చిన్న చిన్న పొరపాట్లను ఓటర్ సెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఏజెంట్ల సమ్మతితో అనుమతించినట్లు తెలిసింది. లేకపోతే చెల్లని ఓట్ల సంఖ్య 10శాతం దాటేదని కౌంటింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 5.54శాతం చెల్లని ఓట్లతో కొంత బెటర్‌గానే ఉంది. అప్పుడు కూడా 2,79,970 ఓట్లలో 15,533 ఓట్లు చెల్లలేదు. ఇక 2015లో గణనీయంగా 9.14 శాతంతో 14వేల పైచిలుకు చెల్లని ఓట్లుగా వృథా కావడం గమనార్హం. ఇక ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది వేసిన పోస్టల్ బ్యాలెట్లలోనూ కొన్ని చెల్లని ఓట్లు ఉన్నట్లు తెలిసింది.



నల్లగొండలో ఎమ్మెల్సీ ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది (ఫైల్)

### పట్టు బిగించిన బీఆర్‌ఎస్

పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పట్టు బిగించిందన్న చర్చ సాగుతున్నది. గతేడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నిరుద్యోగులు, ఉద్యోగ వర్గాలు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారన్న ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఆరు నెలల తేడాతో జరిగిన అచ్చం నిరుద్యోగులు, యువత, ఉద్యోగ వర్గాలతో కూడిన పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గణనీయంగా ఓట్లు పోల్ అవడం విశేషం. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,35,802 మంది పట్టభద్రులు ఓటు వేసి తిరిగి తమ మద్దతును ప్రకటించారు. ఇవి తీన్మార్ మల్లన్న ఓట్లతో పోలిస్తే 14,722 మాత్రమే తక్కువ. ఇక ఈ ఎన్నిక పరిధిలో మొత్తం 34 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వీటిల్లో 32 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలోనూ డిప్యూటీ సీఎం సహా ఆరుగురు మంత్రులు ఉన్నారు. వారంతా తీన్మార్ మల్లన్న కోసం తీవ్రంగా కృషి చేయడంతోపాటు ఆర్థికంగా, అధికారపక్షంగా అండగా నిలిచారు. ఎప్పటి మాదిరిగానే బీఆర్‌ఎస్‌పై అభాండాలు మోపుతూ, అసత్య ప్రచారాలు చేస్తూ పట్టభద్రులైన ఓటర్లను తప్పుదారి పట్టించేలా తీవ్రంగా ప్రయత్నించారు. చివరి రోజు ఓటర్లకు డబ్బులు సైతం భారీగా పంచారు. ఇలా అంగ బలం, అర్థ బలాన్ని ఉపయోగించినా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు బీఆర్‌ఎస్ నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. చివరి వరకు పోరు ఉత్కంఠతను రేకెత్తించింది. స్వతంత్ర అభ్యర్థుల్లో 47 మంది ఎలిమినేషన్ అనంతరం కూడా వారి నుంచి రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు అదనంగా పోలైన ఓట్లు 641 మాత్రమే.

### మల్లన్నకు దక్కని గెలుపు కోటా..

ఎలిమినేషన్ రౌండ్స్‌లో చివరి వరకు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు గెలుపు కోటా రాలేదు. అప్పటికే రెండో స్థానంలో ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కంటే 14,722 ఓట్ల ఆధిక్యంలో ఉన్న మల్లన్నను విజేతగా ప్రకటించేందుకు అనుమతి కోరుతూ రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన లేఖ పంపారు. ఎలిమినేషన్ రౌండ్స్‌లో చివరి అభ్యర్థిగా బీజేపీకి చెందిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ అనంతరం మల్లన్న 1,50,524 ఓట్లు, రాకేశ్‌రెడ్డి 1,35,802 ఓట్లతో మిగిలారు. గెలుపు కోటాకు 1,55,095 ఓట్లు కావాల్సి ఉండగా, బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ అనంతరం మల్లన్న గెలుపు కోటాకు 4,571 ఓట్ల దూరంలో ఉన్నారు. దాంతో చివర్లో మిగిలిన ఇద్దరి అభ్యర్థుల్లో ఎక్కువ ఓట్లు ఉన్న తీన్మార్ మల్లన్ననే గెలిచినట్లుగా ఎన్నికల కమిషన్ అనుమతితో ప్రకటించారు. కానీ.. 2021లో జరిగిన ఎన్నికల్లో మూడో స్థానంలో ఉన్న కోదండరాం ఎలిమినేషన్ రౌండ్‌లోనే బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించడం గమనార్హం.

### 79 వేల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో బీఆర్‌ఎస్‌దే ఆధిక్యం

ఎలిమినేషన్ రౌండ్స్‌లో 49వ అభ్యర్థి పాలకూరి అశోక్, 50వ అభ్యర్థి బీజేపీకి చెందిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి చెందిన 79వేల ఓట్లల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. దాంతో తొలి ప్రాధాన్యత ఓట్లల్లో మల్లన్నకు వచ్చిన ఆధిక్యత చివరలో 18,859 నుంచి 14,722కి తగ్గింది. అశోక్ ఎలిమినేషన్‌లో ఆయనకు చెందిన మొత్తం 30,461 ఓట్లల్లో 5,042 మంది ఎవరికీ ద్వితీయ ప్రాధాన్యత ఓటు వేయలేదు. ఇక మిగిలిన ఓట్లల్లో 10,383 ఓట్లు మల్లన్నకు, 10,118 ఓట్లు రాకేశ్‌రెడ్డికి, 4,918 ఓట్లు ప్రేమేందర్‌రెడ్డికి పోల్ అయ్యాయి. 265 ఓట్లు మాత్రమే మల్లన్నకు ఎక్కువ వచ్చాయి. అశోక్‌కుమార్‌కు పోలైన ఓట్లలో 95శాతం ఓట్లు నిరుద్యోగ యువత ఓట్లే ఉంటాయని అంచనా. అలాంటి నిరుద్యోగుల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఏ మాత్రమూ తీసిపోకుండా బీఆర్‌ఎస్‌కు ఓట్లు పడడం గమనార్హం. ఇదే సమయంలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి పోలైన 48,874 ఓట్లలో ఎలిమినేషన్‌లో ఏకంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 5,232 ఓట్ల ఆధిక్యం లభించింది. బీజేపీ అభ్యర్థికి పోలైన తొలి ప్రాధాన్యత ఓట్లలో 15,086 మంది రెండో ప్రాధాన్యత ఓటు ఎవరికీ ఇవ్వలేదు. ఇక రెండో ప్రాధాన్యత ఇచ్చిన ఓట్లలో బీఆర్‌ఎస్‌కు 19,510 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 14,278 మాత్రమే వచ్చాయి. అంటే మొత్తం 79వేల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో బీఆర్‌ఎస్‌కు 4,967 ఓట్లు ఎక్కువగా రావడంతో కాంగ్రెస్ సర్కార్ తీరు పట్ల యువత, నిరుద్యోగులు, ఉద్యోగ వర్గాల్లో మార్పు మొదలైనట్లుగా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

## కేసుల రాజీ కోసమే లోక్ అదాలత్

- జిల్లా వ్యాప్తంగా 22,429 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు

భువనగిరి అర్బన్, జూన్ 8 : ఇరువర్గాల మధ్య వచ్చిన చిన్న తగాదాలను రాజీ చేసుకోవడం కోసమే జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ఆవరణలలో శనివారం ఉదయం 10:30నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు ప్రారంభించి మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ చట్టం ద్వారా ప్రజలకు ఉచిత న్యాయం, న్యాయ విజ్ఞానం అందించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా తగాదాలను రాజీ చేసుకొని స్నేహపూర్వక వాతావరణంలో ఉండటమే కాకుండా, సివిల్ కేసులను పరిష్కరించుకొని తమ కుటుంబ శ్రేయస్సుకు, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుందన్నారు. రాజీయే రాజ మార్గమని, లోక్ అదాలత్‌లో వరకట్నం క్రిమినల్ కేసులోని ఇరువురు భార్యాభర్తలు వివాదాన్ని విడనాడి తిరిగి కలువడం విశేషమని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 8,421 క్రిమినల్, 6 సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు, టెలిఫోన్ రుణ బకాయిల కేసులు 15, ఎస్‌బీఐ కేసులు 13, ట్రాఫిక్ చలానా కేసులు 13,974.. మొత్తం 22,429 కేసులు పరిష్కరించబడ్డాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 8 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి జిల్లాలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, ఏసీపీ రవీందర్‌రెడ్డి, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, ఏపీపీఓ సౌజన్య, న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్.జయపాల్, జి.శంకర్, పోలీసులు, ఆయా కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గ్రూప్ -1 ప్రిలిమ్స్

- భువనగిరిలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

భువనగిరి అర్బన్, జూన్ 8 : గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు జిల్లాలో 3,349 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వారి కోసం భువనగిరి పట్టణంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10గంటల వరకే అభ్యర్థులను లోపలికి అనుమతిస్తారని, ఆ తరువాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు ఉదయం 8గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, అప్పటి నుంచే లోపలికి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకోవడం ప్రారంభిస్తారని చెప్పారు.



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్ల స్టిక్కరింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

## గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్ల పరిశీలన

భువనగిరి అర్బన్, జూన్ 8 : పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాల, మదర్ థెరిస్సా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ హనుమంతు కె.జెండగే శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్ల స్టిక్కరింగ్, కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులు, బందోబస్తు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## మృగశిర కార్తె సందడి

- జోరుగా చేపల అమ్మకాలు

భూదాన్ పోచంపల్లి, జూన్ 8 : మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా శనివారం మార్కెట్‌లో మాంసపు ప్రియులతో సందడి నెలకొంది. ఈ రోజు చేపలు తింటే ఆరోగ్యానికి చాలా మంచిదని, అస్తమా వ్యాధి రాదనే నమ్మకంతో జనం ఎక్కువగా చేపలు కొనుగోలు చేశారు. దాంతో ఫిష్ మార్కెట్లు కిటకిటలాడాయి. అయితే.. ఈ సారి చేపల ఉత్పత్తి తక్కువగా ఉండడంతో విక్రయదారులు ఎక్కువ ధరకు అమ్మకాలు చేపట్టారు. ప్రత్యేకంగా అక్కడక్కడ చేపల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. దీంతోపాటు చికెన్, మటన్ సెంటర్లు కూడా కోలాహలంగా కనిపించాయి.



భూదాన్ పోచంపల్లిలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

## చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతం

- జీఐ పేటెంట్ రైట్స్ అధికారి సుభజిత్ షా

భూదాన్‌పోచంపల్లి, జూన్ 8 : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చేనేత వస్త్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని, కళాకారుల నైపుణ్యం గొప్పగా ఉందని జీఐ పేటెంట్ రైట్స్ అధికారి సుభజిత్ షా అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిని ఆయన సందర్శించారు. చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం చేనేత వస్త్ర దుకాణాలను సందర్శించి వస్త్ర పరిశ్రమ గురించి అడిగి తెలుసుకున్నారు. చేనేతకు కేటాయించిన డిజైన్లను కొందరు బడా పారిశ్రామికవేత్తలు మిల్లులపై వస్త్రాలను ప్రింట్ చేస్తున్నారని, ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం ప్రతినిధులు కోరారు. చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, అడ్వకేట్ జానకి, చేనేత ప్రతినిధులు ముసుకూరి నరసింహ, ఈపూరి ముత్యాలు, కుడికాల రామనరసింహ, సీత సుధాకర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



జీఐ పేటెంట్ రైట్స్ అధికారి సుభజిత్‌షాను శాలువాతో సన్మానిస్తున్న టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్

# చేప పిల్లల పంపిణీ లేనట్టేనా?

### మత్స్యకారులకు సీడ్ అందజేతపై నీలినీడలు



- గతంలో ఏటా రూ.3కోట్లకుపైగా చేప పిల్లల పంపిణీ
- జిల్లాలో 9వేల మంది కార్మికులకు ఉపాధి
- ఇప్పటికే పూర్తి కావాల్సిన టెండర్లు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- మళ్లీ దళారీ వ్యవస్థకు ఆజ్యం పోస్తారేమోనని మత్స్యకారుల ఆందోళన

*కేసీఆర్ సర్కారు విజయవంతంగా అమలు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేసినట్టేనా? మత్స్యరులకు ఆర్థికంగా చేయూతనిచ్చే కార్యక్రమం ఉన్నట్టా, లేనట్టా? సీజన్ ప్రారంభవుతున్నా ఇంకా చర్యలు తీసుకోపోవడం దేనికి సంకేతం? ఇవీ మత్స్యకారులను తొలుస్తున్న ప్రశ్నలు. ఉచిత చేపల పిల్లల పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కార్యచరణను ప్రకటించకపోవడంతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.*

– యాదాద్రి భువనగిరి, జూన్ 8 (నమస్తే తెలంగాణ)

కేసీఆర్ ప్రభుత్వం వృత్తిదారులకు ఆర్థిక బలోపేతానికి ఊతం ఇచ్చింది. మత్స్యకారులు ఎదిగేందుకు అన్ని రకాలుగా అండగా నిలిచింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేనివిధంగా వంద శాతం సబ్సిడీతో చేపల పిల్లలను అందించి మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. 2016లో ప్రారంభమైన ఈ కార్యక్రమం గతేడాది వరకు నిర్విరామంగా సాగింది. ఎనిమిది విడుతలు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేశారు. జిల్లాలో సుమారు 790 చెరువుల్లో ఏటా రూ.3 కోట్ల రూపాయల సీడ్‌ను వదిలారు. ఇందుకోసం సర్కారుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. 35ఎంఎం నుంచి 40 ఎంఎం, 80 నుంచి 100 ఎంఎం వరకు ఉన్న రెండు రకాల సీడ్‌ను చెరువుల్లో వదిలేవారు. ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్య సంపద కూడా భారీగా పెరిగి, మత్స్యకారులకు ఆర్థిక భరోసా లభించింది.

### తొమ్మిది వేల మందికి ఉపాధి..

ఉమ్మడి రాష్ట్రంలో చెరువులు నిరాదరణకు గురై.. పూడిక తీయక , నీటి వసతి కల్పించక మత్స్యకారులు ఉపాధి లభించకపోయేది. దాంతో కొందరు వలసలు పోగా.. మరికొందరు ఇతర పనులు చేసుకునేవారు. బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల్లో పూడికతీత చేపట్టారు. అనంతరం పుష్కలంగా నీరు చేరడంతో చేపల పిల్లల పంపిణీ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించింది. జిల్లాలో 142 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, 10 మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ద్వారా 8,929మంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. వీరే కాకుండా సభ్యత్వాలు లేనివారు, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తున్నది.

### మళ్లీ దళారీ వ్యవస్థ!

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు చేపల చెరువుల నిర్వహణకు సంబంధించి దళారీ వ్యవస్థ ఉండేది. మత్స్యకార్మికులు దళారీలనే నమ్ముకొనేవారు. వారి నుంచి రూ.2లక్షల నుంచి రూ.3 లక్షలు పెట్టుబడి కోసం తెచ్చుకునేవారు. దాంతో దళారీ చెప్పినపట్టే నడువాల్సి వచ్చేది. తెలంగాణ రాష్ట్రంలో అప్పటి సీఎం కేసీఆర్ ఈ వ్యవస్థను రూపుమాపారు. ఉచిత చేప పిల్లల పంపిణీతో దళారీ వ్యవస్థ లేకుండా పోయింది. ఇప్పుడు ఉచిత చేప పిల్లల పంపిణీ ఆగిపోతే మత్స్యకారులు మళ్లీ ఇబ్బందుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. మళ్లీ దళారుల వ్యవస్థ వచ్చే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇప్పటికే టెండర్లు పూర్తి కావాల్సి ఉన్నా..

గతంలో ఏటా వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే చేప పిల్లల పంపిణీ కోసం ఏర్పాట్లు జరిగేవి. జూన్ ప్రారంభంలోనే టెండర్లకు ఆహ్వానించి ఫైనల్ చేసేవారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే చెరువుల్లోకి సీడ్‌ను వదులుతారు. ఈసారి మాత్రం ఇంకా చర్యలు ప్రారంభించలేదు. వర్షాలు కూడా కురుస్తున్నాయి. సెప్టెంబర్ వరకు సీడ్ వేస్తేనే మంచి ఎదుగుదల వస్తుంది. సీడ్ పంపిణీ ఆలస్యమైతే చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. అయినా ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు రాలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

### పెండింగ్‌లో బిల్లులు..

గతేడాది చేప పిల్లల పంపిణీ కోసం టెండర్లు పిలిచారు. దాని ప్రకారం కాంట్రాక్టర్లు సుమారు రూ.3కోట్ల విలువైన సీడ్‌ను అందించారు. అందుకు సంబంధించి బకాయిలు ప్రభుత్వం వద్దే మూలుగుతున్నాయి. జనవరిలోనే బిల్లులు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు నయా పైసా విదిల్చలేదు. దాంతో కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సర్కారు నుంచి స్పందన లేకపోతే బిల్లుల కోసం కాంట్రాక్టర్లు హైకోర్టు తలుపు తట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

## నకిలీ ధ్రువపత్రాలతో క్రెడిట్ కార్డులు

- వాటితో బ్యాంకు రుణాలు పొందుతున్న ముఠా అరెస్ట్
- రూ.1.32లక్షల నగదు, 44 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం

నీలగిరి, జూన్ 8 : అమాయక ప్రజల నుంచి ఆధార్‌కార్డులు సేకరించి వాటి అడ్రస్‌లు మార్చి, వారి పేరుతో బ్యాంక్ ఖాతాలు తెరిచి, క్రెడిట్ కార్డులు తీసుకొని రుణాలు పొందుతున్న ముగ్గురు నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. వారి నుంచి రూ. 1,32,600 నగదు, 27 ఆధార్ కార్డులు, 44 సెల్ ఫోన్లు, రెండు కార్లు, 83 పాన్ కార్డులు, 18 సిమ్ కార్డులు, 92 క్రెడిట్ కార్డులు, 64 రబ్బరు స్టాంపులు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఒక కలర్ ప్రింటర్, 9 బోగస్ సంస్థల పత్రాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామానికి చెందిన కాశమల్ల క్రాంతికుమార్ ఎంబీఏ చదివి హైదరాబాద్‌లో సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపనీ పెట్టి కొంతకాలం నిర్వహించాడు. అందులో నష్టాలు రావడంతో దానిని మూసేశాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గతంలో తన వద్ద పని చేసిన శిలువేరు సతీశ్‌తో కలిసి ప్లాన్ రూపొందించాడు. నల్లగొండ పట్టణానికి చెందిన తన బాబాయ్ కాశమల్ల నాగరాజు వద్దకు వెళ్లి ఆయనకు తెలిసిన, చదువురాని కొంతమంది నుంచి ఆధార్ కార్డులు తీసుకొచ్చి ఇస్తే కొంత నగదు ఇస్తానని చెప్పాడు. దాంతో నాగరాజు తనకు తెలిసిన వారి ఆధార్ కార్డులు సేకరించి క్రాంతికుమార్‌కు ఇచ్చాడు. క్రాంతికుమార్, సతీశ్ ఆ ఆధార్ కార్డుల్లోని అడ్రస్‌లను ఫొటోషాప్‌లో మార్చి వాటితో పాన్‌కార్డులు, సిమ్ కార్డులు తీసుకున్నారు. అవే కార్డులతో తాము ఏర్పాటు చేసిన బోగస్ కంపెనీల్లో వారిని ఉద్యోగులుగా చూపుతూ వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, పాస్ పుస్తకాలు, చెక్ బుక్‌లు, ఏటీఎం కార్డులు తీసుకున్నారు. వారి ఖాతాల్లో నగదు వేయడం, తీయడం చేస్తూ సిబిల్ స్కోర్ పెంచారు. ఈ స్కోరు ఆధారంగా వారి పేరుతోనే వివిధ బ్యాంకుల్లో క్రెడిట్ కార్డులు, రుణాలు తీసుకున్నారు. అట్టి రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లించకుండా జల్సాలకు, వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారు. ఈ విషయమై బాధితుల్లో ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎవరు కూడా తమ వ్యక్తిగత ఆధారాలు ఇతరులకు ఇవ్వవద్దని సూచించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, క్రెడిట్ కార్డులు